నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, ఆదివారం 17 మార్చి 2024 | KAMAREDDY

బిచ్కుందలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే, నాయకులు

ఎల్లారెడ్డిలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల, నాయకులు

నిరసనల హోరు

ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

- ఉమ్మడి జిల్లాలో ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు
- కేంద్ర ప్రభుత్వం, మోదీ దిష్టిబొమ్మల దహనం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాభవం తప్పదని హెచ్చరిక

నిజామాబాద్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డిచ్‌పల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. కవిత అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు నిరసనలతో హోరెత్తించాయి. జిల్లా కేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిజామాబాద్‌లో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కామారెడ్డిలో మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బిచ్కుందలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రాంతీయ పార్టీలను టార్గెట్ చేసి, ఆ పార్టీలకు చెందిన నాయకులపై కక్ష సాధిస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను అణగదొక్కడానికి కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు.

కామారెడ్డిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు

నందిపేటలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మోర్తాడ్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

బాన్సువాడలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మోగింది నగారా

నిజామాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

సార్వత్రిక సమరానికి షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది.

గెలుపే ధ్యేయంగా గులాబీ పార్టీ..

ఎన్నికల పండుగకు తెర లేసింది. సార్వత్రిక సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మే 13న తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుపనున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు లోక్‌సభ సీట్లు ఉన్నాయి. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 16.89 లక్షల మంది, జహీరాబాద్ సెగ్మెంట్‌లో 16.31 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. మరోవైపు, ప్రజాక్షేత్రంలో పోరుకు రాజకీయ పార్టీలు సైతం సన్నాహాలు ప్రారంభించాయి. ఇటీవలే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్.. ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా గులాబీ పార్టీ వ్యూహాలు రచిస్తున్నది. నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను ఖరారు చేస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అభ్యర్థులు ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పని ప్రారంభించారు. తెలంగాణ తెచ్చిన ఉద్యమ పార్టీగా ప్రజలతో మంచి అనుబంధం ఉన్న బీఆర్ఎస్ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను చేజార్చుకోకుండా బీఆర్ఎస్ సైతం పకడ్బందీ వ్యూహాలకు పదును పెడుతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అన్నట్లుగా వ్యవహరిస్తోన్న తీరును ప్రజలకు వివరించి బీఆర్ఎస్ ప్రచార పర్వంలో దూసుకు పోయేందుకు సిద్ధమవుతున్నది.

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- సార్వత్రిక సమరానికి ముహూర్తం ఖరారు
- మే 13న ఎలక్షన్లు, జూన్ 4న కౌంటింగ్
- ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు
- 'నిజామాబాద్' సెగ్మెంట్‌లో 16.89 లక్షల ఓటర్లు
- 'జహీరాబాద్'లో ఓటు వేయనున్న 16.31 లక్షల మంది
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

ఎన్నికల నియమావళి పాటించాలి

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు కోసం 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల చేస్తామని, 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 26 వరకు పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఎస్పీ సింధూ శర్మ మాట్లాడుతూ..ప్రజలు ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని సూచించారు.

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	266	1,22,238	1,32,013	20	2,54,271
జుక్కల్	255	99,113	1,02,813	9	2,01,935
ఎల్లారెడ్డి	270	1,06,373	1,15,355	2	2,21,730
బాన్సువాడ	258	93,266	1,02,415	13	1,95,694
నారాయణ్‌ఖేడ్	296	1,18,064	1,17,498	9	2,35,571
ఆందోల్	313	1,22,026	1,27,364	8	2,49,398
జహీరాబాద్	313	1,36,569	1,36,391	2	2,72,962
మొత్తం	1,971	7,97,649	8,33,849	63	16,31,561

మహిళా ఓటర్లే అత్యధికం..



నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. అత్యధికంగా నిజామాబాద్ అర్బన్‌లో 2.99 లక్షల ఓటర్లు ఉండగా, ఆర్మూర్‌లో అత్యల్పంగా 2.10 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. బాల్కొండ మినహా అన్ని నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అత్యధికంగా నిజామాబాద్ అర్బన్‌లో 289, నిజామాబాద్ రూరల్‌లో 293 పోలింగ్ కేంద్రాలున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం భౌగోళికంగా సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో విస్తరించి ఉంది. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం సంగారెడ్డిలోనే ఉంది. జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, ఆందోల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాలు 'జహీరాబాద్' లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. అత్యధికంగా జహీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2.72 లక్షల మంది ఓటర్లుండగా, అత్యల్పంగా బాన్సువాడలో 1.95 లక్షల మంది ఓటర్లున్నారు. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో తప్ప మిగిలిన అన్ని చోట్ల మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఆందోల్, జహీరాబాద్‌లో అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

మూడు నెలల పాటు కోడ్..

గత ఎన్నికలప్పుడు మొదటి విడుతలోనే తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈసారి మాత్రం 4వ విడుతలో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. దాదాపుగా 3 నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్నది. నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి స్థానిక కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు రిటర్నింగ్ అధికారిగా, జహీరాబాద్ లోక్‌సభకు సంగారెడ్డి కలెక్టర్ ఆర్‌వోగా వ్యవహరిస్తున్నారు. నామినేషన్ల దాఖలు, విత్‌డ్రా అన్ని ప్రక్రియలను వీరే పర్యవేక్షిస్తారు. కోడ్ అమల్లోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎలాంటి అధికారిక కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, అధికారిక పర్యటనలు వంటివేవి ఉండవు. ఒకవేళా ఎవరైనా ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యవహారాల్లో తలదూర్చితే కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ అధికారులు సైతం రాజకీయ పార్టీలతో కుమ్మక్కు కావడం, ఆయా పార్టీలకు అంటకాగి పని చేస్తే వారిపైనా వేటు పడుతుంది. ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖల్లో భారీగా బదిలీలు చేపట్టారు. మూడేళ్లుగా తిష్ట వేసిన వారిని బదిలీ చేశారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు ఉన్న వారెవ్వరినీ స్థానికంగా ఉద్యోగం చేసే అవకాశం లేకుండా వేరే నియోజకవర్గాలకు బదిలీ చేశారు. అయినప్పటికీ నిజామాబాద్ కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఇద్దరు అధికారులు మాత్రం ఎన్నికల సంఘం కళ్లుగప్పి ఇక్కడే తిష్ట వేసుకుని వ్యవహారాలు చక్కబెడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిపాలనా బాధ్యతల్లో ఉన్న వారికి ఎన్నికలకు సంబంధం ఉండదంటూ కొందరు ఉన్నతాధికారులే వెనకేసుకొస్తుండడం గమనార్హం.

అకాల వర్షం

సిరికొండ, ఇందల్వాయిలో వడగండ్ల వాన..
రాలి పోయిన ధాన్యం గింజలు
ఆందోళనలో రైతులు

సిరికొండ మండలం కొండూర్‌లో నేలరాలిన వడ్లు

సిరికొండ/ధర్పల్లి/ఇందల్వాయి/చందూర్/ఖలీల్‌వాడి, మార్చి 16: నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, చందూర్ మండలాల్లో శనివారం అకాల వర్షం కురిసింది. సిరికొండ, ఇందల్వాయి మండలాల్లోని పలు గ్రామాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సిరికొండ మండలం కొండూర్, పోత్నూర్, చిన్నవాల్గోట్, సిరికొండ, తాళ్లరామడ్గు, పందిమడుగు, చీమన్‌పల్లి, ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి తదితర గ్రామాల్లో వడగళ్ల వాన కురవగా..పందిమడుగు, చీమన్‌పల్లి, నల్లవెల్లి గ్రామాల్లో పంట పొలాల్లో ధాన్యం గింజలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయానికి రాళ్ల వాన కురిసి పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ పంట నష్టం వాటిల్లడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులు సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలోజలమయమైన రోడ్లు

జిల్లా కేంద్రంతోపాటు ధర్పల్లి మండలంలో ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇందూరు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొన్నిరోజులుగా ఉక్కపోతతో సతమతమవుతున్న వారికి కొంత మేర ఉపశమనం లభించింది. ఎండిపోతున్న వరి పంటలకు చివరి తడికి నీరందినట్లయ్యిందని రైతులు చెబుతున్నారు.

ధర్పల్లిలో రోడ్డుపై పడిన చెట్టు

రామడుగులో నేలవాలిన వరిపైరు

పెండ్లికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

ఆటోబోల్తాపడి ఇద్దరు మృతి
లింగంపేట మండలం బాయంపల్లి వద్ద ఘటన

ప్రమాదానికి గురైన ఆటో, క్షతగాత్రులు

ఎల్లారెడ్డి, మార్చి 16 : పెండ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆటోబోల్తాపడి ఇద్దరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన లింగంపేట మండలం బాయంపల్లి వద్ద శనివారం చోటుచేసుకున్నది. నిజాంసాగర్ మండలంలోని సింగీతం, గున్కుల్, వడ్డెపల్లి గ్రామాలకు చెందిన 11 మంది లింగంపేట మండలం కోర్పోల్ గ్రామంలో ఓ పెండ్లికి ఆటో లో వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా బాయంపల్లి వద్ద ఆటో అదుపు తప్పి గుంతలోకి వెళ్లి పడిపోయింది.ఈ ప్రమాదంలో సింగీతం గ్రామానికి చెందిన సంగయ్య (66) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రం గా గాయపడిన లాలవ్వ(50)ను దవాఖానకు తరలించగా అక్కడ చనిపోయింది. ప్రమాదంలో గున్కుల్ గ్రామానికి చెందిన ఏడుగురు పెద్దలు, ముగ్గురు పిల్లలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో బాలమణి, సతీశ్, సాయవ్వ, పోచవ్వ, కవిత ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు.